# మా ఊరు

"ఏంటి ఉట్టి కంట్రీ వెధవ ఊరురా" అన్నాడు విశాఖపట్నం నుండి వచ్చిన మా కజిన్.

"అంటే?" అన్నాను అర్థం కాక.

"ఏముందీ? పల్లెటూరు కాదు. పట్నం కాదు. మధ్యలో ఉంది"

అవున్నిజమే!

కంటెకి చిన్న, ఉంగరానికి పెద్ద అన్నట్లుండేది మా ఊరు. రైల్వే స్టేషను లేదు. సముద్రం లేదు. ఉన్న ఏరూ రెండు మైళ్ల దూరం. వర్షాకాలంలోనే దాన్లో నీళ్లుండేది. వేసవి కాలంలో దాన్లో నడిస్తే మంత్రం లేకుండా పిర్లగుండం తొక్కినట్టుండేది.

ఊరికి ఒకటే మెయిన్ రోడ్డు. ఆ రోడ్డు ఎప్పుడు వేశారో తెలీదు కాని, నేను పుట్టాక దాన్ని బాగు చెయ్యలేదు. రోడ్డు కిటూ అటూ ఊరుండేది. ప్రతి ఇంటికీ పెద్ద పెరడు, పెరటి నిండా రకరకాల చెట్లు. తొగర చెట్లు మా ఊరి పెరళ్లలో తప్ప యింకెక్కడా కనిపించలేదు. ప్రతి ఇంట్లోను దేవుడికి పువ్వుల కోసం గన్నేరు చెట్లు, నిత్యమల్లి చెట్లు విధిగా ఉండేవి. గన్నేరుకాయలు ఎక్కువగా ఆత్మహత్యలకి పనికొచ్చేవి. కాని చాలా స్లోయాక్టింగ్. అంచేత ఆత్మహత్య చేసుకోదల్చిన వారు కడుపు నిండా గన్నేరు కాయలు తినేసి తాపీగా చెప్పేవారు తిన్నట్టు.

ప్రతి ఇంట్లోను ఓ నుయ్యి ఉండేది. అయితే ఆ నూతి నీళ్లు ఊరు అంటుకున్నప్పుడే పనికి వచ్చేవి. మా నూతి నీళ్లు నోట్లో పోసుకున్న మా కజిన్ "ఇంత కంటే మా విశాఖపట్నం సముద్రం నీళ్లు నయం" అన్నాడు.

ఊరి పొలిమేర దాటి ఎక్కడ నుయ్యి తవ్వినా మా పని మనిషి ముత్యాలు చెప్పినట్టు 'ముంజునీళ్లే' పడేవి. ఊరి చివర అన్నివేపులా

చెరువులుండేవి. ప్రతి చెరువు గట్టున ఒక నుయ్యి ఉండేది. ఆ నూతుల నీళ్లే ఊరందరికి మంచినీటికి ఆధారం. లేబరు మాత్రం 'నూతి నీళ్లు వేడి చేస్తాయి' అని చెరువు నీళ్లే తాగేవారు.

అమ్మవారి గుళ్లూ, రామమందిరాలూ తప్పిస్తే ఊళ్లో నాలుగు గుళ్లు ఉండేవి. కేశవ స్వామి, వినాయకుడు, ఈశ్వరుడు, ఆంజనేయస్వామి ఆ గుళ్లలో దేవుళ్లు.

వినాయక చవితికీ, శివ రాత్రికీ తప్పిస్తే మా ఆరాధ్య దైవం ఆంజనేయ స్వామి. కారణాలు చాలా ఉన్నాయి. ఆ గుడి మా వీధిలోనే ఉండడం ఒక కారణం. ప్రతి మంగళ వారం గుడికి వెళ్తే శనగలు ప్రసాదం ఇవ్వడం మరో కారణం. మా అమ్మ నెలకి రూపాయి యిస్తే, ప్రతి మంగళవారం మా గోత్రనామాల్తో పూజచేసి మాయింటికి పళ్లెం నిండా ప్రసాదం తెచ్చి ఇచ్చేవారు. అయినా సరే నేను విధిగా గుడికి వెళ్లి "ఈ ఏడు గట్టెక్కించు స్వామీ" అని ఆంజనేయ స్వామిని ప్రార్థించి ప్రసాదం తీసుకునే వాడ్ని.

"ఇంటికి ప్రసాదం వస్తుంది కదా, మళ్లీ గుడికెందుకెళ్తావురా?" అనేది మా అమ్మ.

గుడికి భక్తి వల్ల వెళ్లడం లేదని ఆవిడ శంకించిందని బాధపడినా, ఫ్రీగా వచ్చిన ప్రసాదం ఎక్కువ రుచని తెలియని ఆవిడ అజ్ఞానానికి ఎక్కువ బాధ కలిగింది. ఆవిడని అని ప్రయోజనం లేదు. రెండు ప్రసాదాలూ తిన్న వాళ్లకే తెలుస్తుంది ఆ భేదం.

ఆంజనేయుడంటే మాకు ఇష్టం ఉండడానికి మరో కారణం బహూశా "పాపం! ఆంజనేయుడికి పెళ్లాం లేదుట్రా" అన్న మా కైకగాడి అభిప్రాయం కూడా కావచ్చు.

మొగాడికి 'కైక' అన్న పేరేవిటి అన్న సందేహం రావచ్చు. దానికోకథ ఉంది. నేను చెప్పబోయేది అదే.

అప్పుడు మేము మూడోక్లాసు చదువుతున్నాం. మా స్కూలు సగం పడిపోవడానికి సిద్ధంగా ఉంది. మిగతా సగం ఎప్పుడో పడిపోయింది. అది కట్టినప్పుడే దానికి సున్నం వేశారు. గోడకి కొంతమేర తారు రాసేరు. అదే మా బ్లాక్ బోర్డు. దాని మీద సుద్దముక్కతో రాయగా రాయగా అది గోడకంటె తెల్లగా అయిపోయింది. అదేం కక్కుర్తో కాని

సుద్దముక్కని చేతికి అందనంత వరకు వాడేవారు మేష్టర్లు. ఆ పారేసిన సుద్దముక్కల కోసం అందరం ఆశ పడేవారం. తీరా అది కింద పడినప్పుడు కేవలం ఇద్దరో, ముగ్గురో పిల్లలు దానికోసం పరిగెత్తేవారు. ఎంచేతంటే అది ఎప్పుడు పడుతుందో తెలియాలి. అంత ఓపిక క్లాసులో ఏ ఇద్దరు ముగ్గురికో మాత్రం ఉండేది.

ఇంతకీ కైకగాడి కథ.

వాడికి పలక, బలపం పెట్టుకోవడానికి చిన్న అట్టపెట్టె ఉండేది. ఇప్పుడంటే మూడేళ్లకే పెన్సిలు, రబ్బరు ఇస్తున్నారు. మాకు పెన్సిలు నాలుగో క్లాసు వరకు లేదు. మా పలకలకి ముందు బందులు పోయేవి. తరవాత ఆ బోడి పలక ముక్కలు ముక్కలయ్యేది. మా బాతుగాడిది ఎప్పుడూ పాకెట్ సైజు పలకే. కాగా, పోగా కైకగాడు పెట్టుబడిదారీ వర్గంవాడు. ఒకనాడు మేష్టారు రామాయణం పాఠం చెప్తున్నారు. పాపం కైకగాడికి చదువుకొని బాగుపడాలన్న కోరిక లేకపోలేదు. అంచేత పాఠం మొదట్లో బాగానే వినేవాడు. కాని ఏ సరస్వతీ దేవి శాపమో కాని పాఠం మొదలైన రెండు మూడు నిముషాల్లో ధ్యానం మళ్లిపోయేది.

ఆవేళ – సీతని రావణాసురుడు ఎత్తుకు పోతున్న టైముకి – మీద నుండి ఏదో మెత్తగా కైకగాడి కాలి మీద పడి ఒడిలోకి జారింది. కైకగాడు సీత సంగతి రావణాసురుడికి వదిలేసి తనని శరణు జొచ్చిన దానివేపు చూశాడు. అది వాడిబొటన వేలంత ఉంది. అప్పటి వరకు తను పెద్దయ్యాక డాక్టరవడవాఁ, ప్లీడరవడవాఁ అన్న సంగతి తేల్చుకోలేకపోయేడు. కాని ఎలకపిల్ల దొరికిన క్షణాన వాడిలోని డాక్టరు జయించాడు. డాక్టరు ఎలకపిల్లని స్కూలు వదిలేక పోస్ట్ మార్టమ్ చెయ్యడానికి అట్టపెట్టెలో దాచేసేడు. తనకు తెలియకుండానే వాడు పెట్టెలో నించి బలపం తియ్యడం, వాడి తొడను ఏదో కుట్టటం జరిగిపోయేయి.

ఎంత పాపినైనా విచారణ చెయ్యకుండా చంపడం కైకలోని ప్లీడరుకి ఇష్టం లేదు. అంచేత దోషి చచ్చిపోకుండా తీసి అరచేతిలో పెట్టుకున్నాడు కైకగాడు.

ముద్దాయి–అర్నెల్లై నిరాహార దీక్ష చేస్తున్నట్టున్న ఒక నల్లి.

దానంలో కైకగాడికి కొంత నమ్మకముంది. కాని రక్తదానానికి కొంత

వెనకంజ వేస్తాడు. ఆ నల్లి తన జేబులో ఉన్న జీడిని అడిగితే వెంటనే ఇచ్చేసేవాడు. కాని అది కోరింది పచ్చి నెత్తురు.

"అతిథి అభ్యాగతులు వచ్చినప్పుడు మనం పెట్టాలి. లేకపోతే పెట్టే చోటు చూపించాలి" అన్న హరిదాసు చెప్పిన నీతి సడన్‌గా జ్ఞాపకం వచ్చింది కైకగాడికి.

అంచేత ఆ నల్లిని ఎవరి మీదికి పంపుదామా అని అటూ ఇటూ చూశాడు. వాడి ముందున్న మురళిగాడు. వరండా చూరులో ఉన్న పిల్లలకి తిండి పెడుతున్న పిచ్చిక వైపు అతి టెండర్‌గా చూస్తున్నాడు. కుడి వైపున్న గౌరీసుగాడు ఎప్పుడు కొడతాడా అని గంటవైపు చూస్తున్నాడు.

ఎడం వైపు చూశాడు. ప్రమీల కనిపించింది. ఆ అమ్మాయికి పాఠం మీదున్న శ్రద్ధ చూసి అసహ్యం వేసింది. తను కూర్చున్న కడప రాయికీ, ప్రమీల కూర్చున్న కడప రాయికీ మధ్య మరో రాయి ఉంది. (అప్పుడు యిప్పటిలా బెంచీలు, డస్కులు ఏం లేవు. శుభ్రంగా నేలని మరం వేసుక్కూర్చోవడవేః). ఆ రాళ్ల మధ్య సన్నటి గాడీ ఉంది. ఆ గాడీలో వదిలేడు నల్లిని కైకగాడు. అయితే వీడి చూపు గాడి మీదే ఉండటం వల్ల వీడు చేస్తున్న పని ప్రమీల చూసిందని వాడికి తెలీదు. అంతేకాదు. వాడు ఎలక పిల్ల కిడ్నాపింగునీ, నల్లిని పట్టుకోవడాన్ని కూడా చూసిందని వాడికి తెలీదు.

మొరాయిస్తున్న జట్కా గుర్రంలా ఆ గాడీలో కూర్చుండి పోయింది నల్లి. యుద్ధంలో ఏనుగుని అంకుశంతో పొడిచినట్టు దాన్ని పొడిచేడు కైకగాడు. నల్లి మొదటి మజిలీ ప్రారంభించింది. ప్రమీల మాష్టారు వేపు తిరిగి పోయింది.

ఆ పిల్ల క్రిందటి జన్మలో నల్లో ఏమో కాని, ఆ నల్లి ఎన్ని మజిలీలు చేస్తుందో, దాన్ని కైకగాడు ఎన్నిసార్లు తొయ్యాలో సరిగ్గా లెక్క కట్టింది. ప్రమీల మళ్లీ నల్లివైపు చూసేసరికి అది అరంగుళం దూరంలో ఉంది. ఆ పిల్ల బలపంతో దాన్ని వెనక్కి మళ్లించి కైకగాడ్ని వెక్కిరించింది.

స్కూలు వదిలేక రేప్ చేస్తానన్నంత కోపంగా చూశాడు కైకగాడు ప్రమీల వేపు.

తరవాత నాలుగు వెక్కిరింపులూ, నాలుగు రేప్ చూపులూ అయేయి.

నల్లి నడవలేక, నడవలేక నాలుగోసారి ప్రమీలవైపు నడిచింది.

అదిగో, సరిగ్గా ఆ టైములో "ఒరేయ్! తల మాసిన అంట్ల వెధవా, నిన్నేరా, నిలబడు" అన్నారు మేష్టారు.

క్లాసులో సగం మంది తల మాసిన అంట్ల వెధవలే. మిగతా సగం మంది ఆడపిల్లలు.

మేష్టారు వాడ్ని ఉద్దేశించి అన్లేదు. అయినా ఠక్కున లేచి నిల్చున్నాడు కైకగాడు.

"ఒరేయ్! రావణుడి పెళ్లాం ఎవర్రా? వెంటనే చెప్పు. లేకపోతే డొక్క చీరేస్తాను" అన్నారు మేష్టారు. వెంటనే చెప్పకపోతే చీరేస్తానన్నారు గాని తప్పుచెప్తే చీరేస్తానన్లేదని కైకలోని ప్లీడరు సలహా, అంచేత వెంటనే "కైక" అన్నాడువాడు.

"ఒరేయ్ 'కైక' వెధవా! గోడకుర్చీ వెయ్యి, నయం దశరధుడు అన్లేదు" మేష్టారు మేజిస్ట్రేటు అయిపోయారు. 'ఈ మేష్టర్లకి ఇంత తొందర ఉండకూడదు' అనుకున్నాడు కైకగాడు.

పాపం! వాడు మాత్రం ఏం చేస్తాడు?

వాడికి తెలిసిన పురాణ స్త్రీలు, సీత, ద్రౌపది తరువాత కౌసల్య, సుమిత్ర, కైక.

కైక అంత మంచిది కాదన్న ఇంప్రెషన్ వాడికి ఎంచేతో ఏర్పడింది.

అసలు రావణాసురుడికి పెళ్లి అయిందనే తెలీదు వాడికి. కాని మేష్టారు అంతనమ్మకంగా అడిగితే రావణాసురుడికి పెళ్లే కాలేదని వాదిద్దామన్న ఆలోచన వదులుకోవలసి వచ్చింది.

రావణాసురుడు చెడ్డవాడని రావణాసురుడే ఒప్పుకుంటాడు. చెడ్డవాడి పెళ్లాం చెడ్డదైతేనే ఉజ్జీ సమంగా ఉంటుంది.

అంచేత 'కైక' అన్నాడు వాడు.

క్లాస్ అయిపోయేక "ఇంక లేరా కైకా" అంది ప్రమీల. ఇప్పుడొస్తున్న సినిమాలు అప్పట్లోనూ ఉండేవి. "నిన్ను పెళ్లాడి సర్వనాశనం చేస్తాను" అన్న శపథం చేశాడు కైకగాడు, కాని అప్పుడు ఇవి లేవు. కాబట్టి "నిన్ను ఎప్పుడో ఒకప్పుడు చంపేస్తాను" అని శపథం చేసుకున్నాడు.

ఇది కైకగాడి కథ.

*("ఆంధ్రప్రభ" వారపత్రిక 16-4-1997)*